క్లుప్తంగా

గణితం టిప్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఖాన్ బాజీ

నల్లజర్ల: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం గణితంలో ఈజీ టిప్స్‌పై రిసోర్స్‌పర్సన్ ఎస్‌కే ఖాన్ బాజీ విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఏవీ రమణ మాట్లాడుతూ, విద్యార్థులతో పుస్తక పఠనం చేయించడంతో పాటు, కథలు చెప్పించడం, చిత్రలేఖనం, కథనాలు, సృజనాత్మక కృత్యాలు చేయిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు చెస్, పేపర్ ఆర్ట్, క్యారమ్స్ వంటి ఆటల్లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు ఇంటర్వ్యూలు



కొవ్వూరులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: డివిజన్‌లో ఖాళీగా ఉన్న 20 అంగన్‌వాడీ ఆయాల పోస్టుల భర్తీకి శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా పోస్టులకు 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలో నాలుగు పోస్టులకు 21 మంది, పెరవలిలో ఏడు పోస్టులకు తొమ్మిది మంది, గోపాలపురంలో తొమ్మిది పోస్టులకు 24 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి కె.విజయకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఇంటర్వ్యూల నివేదిక జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కొవ్వూరు, పెరవలి, గోపాలపురం సీడీపీవోలు డి.మమ్మి, సీహెచ్ శ్రీలక్ష్మి, కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సత్కారం



శిరీషను సత్కరిస్తున్న ఎస్సై, సర్పంచ్

గోపాలపురం: పది పరీక్షల్లో 595 మార్కులు సాధించిన గోపవరం విద్యార్థిని వెలగా శిరీషను హుకుంపేట జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సత్కరించారు. టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన గోపవరానికి చెందిన చిలకంటి ఆశ, గుడ్ల మహేష్‌ను ఎస్సైతో పాటు, సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు సన్మానించారు.

ఉచిత అన్న సమారాధన



వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

పెరవలి: వైశాఖ మాసం శనివారం కావటంతో అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు ఇచ్చారు. దాతల ఆర్థిక సాయంతో సుమారు ఆరు వేల మందికి ఉచిత అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ, ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన స్వామివారికి పూలాలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం వంటి కార్యక్రమాలకు భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామని తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సాయికృష్ణ

కొవ్వూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఐ.పంగిడి గ్రామ సచివాలయంలో మే డే వారోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ మాట్లాడుతూ, కార్మికులకు ఎన్నో రకాల హక్కులున్నాయని, వీటిపై అవగాహన ఉండాలని సూచించారు. కార్మిక సంక్షేమ బోర్డు అందించే వివిధ పథకాలను వివరించారు. సర్పంచ్ గోశాల నాగార్జున, న్యాయవాది పి.హరీష్, కార్యదర్శి జి.ముత్యం, ఏఎస్సై టి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడికి నిరసన

నిడదవోలు: తెలంగాణలో ఆంజనేయ స్వామిని మొక్కినందుకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దళిత యువకుడిని నడిరోడ్డుపై నగ్నంగా చేసి, విచక్షణా రహితంగా దాడి చేయడంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. స్థానిక ఇందిరా నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన తెలుపుతూ, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం రోడ్డుపాలు.. రైతు దిగాలు

- టార్గెట్ లేదని కొనుగోలు చేయని ప్రభుత్వం
- రోడ్లపైనా, చేలల్లో ధాన్యం రాశులు
- సగం కూడా జరగని కొనుగోళ్లు
- రైతు భరోసా కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు



అన్నదేవరపేట వద్ద బస్తాల్లోకి ధాన్యం పడుతున్న రైతులు, కూలీలు

తాళ్లపూడి/పెరవలి: ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతులు అమ్ముకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. ధాన్యం కొనే నాథుడు లేక ఆందోళన చెందుతున్నారు. దళారులు తక్కువ ధరకు చేజిక్కించుకునేందుకు యత్నిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 27,778 ఎకరాల్లో రబీలో వరి సాగు చేశారు. మొత్తం 1,16,667 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

కొవ్వూరులో 10,790, తాళ్లపూడిలో 8,768, చాగల్లులో 8,220 ఎకరాల్లో సాగు చేశారు. రైతులు ఈ–క్రాప్ బుకింగ్ కూడా చేసుకున్నారు. రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు సుమారు 40 శాతం 46,667 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా మిల్లర్లు కొనుగోలు చేశారు. మండలంలోని పోచవరం, అన్నదేవరపేట, గజ్జరం, వేగేశ్వరపురం, తాళ్లపూడి, తాడిపూడి, పక్కిలంక, తిరుగుడుమెట్ట గ్రామాల్లోని రైతుల ధాన్యాన్ని ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది.

చేలల్లో 15 వేల మెట్రిక్ టన్నులు

తాళ్లపూడి మండలంలో ఇప్పటి వరకు 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. దీంతో ఇంకా మండలంలో 15 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రైతుల చేలల్లో ఉంది. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రోడ్ల పక్కన, చేలల్లో రాశులుగా పోసి, బస్తాల్లో పట్టి ఉంచారు. మరో వైపు రైతులకు సంచులు కూడా అందని పరిస్థితి నెలకొంది. రైతులు కాళ్లరిగేలా రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు టార్గెట్లు రావడం లేదని అధికారులు, సిబ్బంది వారికి సమాధానమిస్తున్నారు. మిగిలిన ధాన్యం ఎప్పుడు కొంటారో తెలియక రైతులు అయోమయంలో పడుతున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

నష్టపోతున్న రైతులు

రబీలో ధాన్యం ఎక్కువ దిగుబడి వచ్చిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని అగుతున్నారని చెబుతున్నారు. బస్తాకు రూ.300 నుంచి రూ.400 వరకు దళారులు తక్కువకు అడుగుతున్నారు. దీంతో రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం తక్షణం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



20 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేపట్టాను. ఐదు రోజులుగా పంట కోస్తున్నాం. రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి. మిల్లర్లు సంచులు కూడా లేవని చెబుతున్నారు. కోసిన ధాన్యం రోడ్డు పక్కన పెట్టాల్సి వచ్చింది.

– కొండే వెంకటరమణ, రైతు, అన్నదేవరపేట

కొనుగోలు చేసేందుకు చర్యలు



రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో ఇప్పటి వరకు 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. గతేడాది టార్గెట్ పూర్తయింది. రైతుల వద్ద ఇంకా సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అందిన టార్గెట్ మేరకు ధాన్యం కొనుగోలు చేస్తాం.

– జి.రుచిత, వ్యవసాయాధికారి, తాళ్లపూడి మండలం

ఎప్పుడూ చూడలేదు



గత ఇరవై ఏళ్లలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదు. ధాన్యం అమ్ముదామంటే కొనే నాథుడే లేడు. మిల్లర్లు వద్దంటున్నారు. దళారీలు అయిన కాడికి అడుగుతున్నారు. ఏం చేయాలో తెలియటం లేదు. ధాన్యం రోడ్డు పక్కన రాశి చేసి ఉంచాను.

– లొల్ల దనయ్య, వరి రైతు, పెరవలి

దిక్కుతోచని స్థితిలో అన్నదాత



పెరవలిలో రోడ్డుపైనే ధాన్యం రాశులు

నిడదవోలు నియోజకవర్గంలో ఈ ఏడాది 36 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నిడదవోలు మండలంలో కోతలు పూర్తవ్వగా, పెరవలిలో 70 శాతం, ఉండ్రాజవరంలో 80 శాతం కోతలు జరిగాయి. ప్రస్తుతం ఆయా మండలాల్లో 50 శాతం ధాన్యం రైతుల నుండి సేకరించారు. మిగిలిన 50 శాతం ధాన్యం సేకరించటానికి అనుమతులు లేకపోవటంతో రైతులు అల్లాడిపోతున్నారు. కడుపు మండిన కొత్తపల్లి, పెరవలి రైతులు రాస్తారోకో చేస్తే.. మంత్రి కందుల దుర్గేష్ జిల్లా అధికారులను సంప్రదించి, ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కేవలం 500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి వారు చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం పెరవలి మండలంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందని రైతులు చెబుతుండగా, అధికారులు మాత్రం 10 వేల మెట్రిక్ టన్నులుందని అంటున్నారు. ఈ క్రమంలో పెరవలి మండలంలో ఏ గ్రామంలో చూసినా ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. రోడ్లు, ఖాళీ స్థలాలు, చేలు, పుంత, ఏటిగట్ల పైనే నిల్వలు చేసి ఉంచారు. కానూరు అగ్రహారం, కానూరు, పెరవలి, కాకరపర్రు, అజ్జరం, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, అన్నవరప్పాడు గ్రామాల్లో ధాన్యం ఉంది. ధాన్యం కొనేవారు లేకపోవటంతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ టార్గెట్ ప్రకారం ధాన్యం సేకరణ పూర్తి కావడంతో మిల్లర్లు ధాన్యం వంక చూడటం లేదు. దళారీలను సంప్రదిస్తే అయిన కాడికి అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మండలంలో వరికోతలు 80 శాతం పైగా పూర్తయ్యాని పెరవలి ఏఓ మేరీ కిరణ్ తెలిపారు. ధాన్యం 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే సరిపోతుందని, అనుమతుల కోసం వేచి చూస్తున్నామన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి: పక్కిలంక మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పొట్నూరి విజయలక్ష్మి నరాల వ్యాధితో బాధపడుతోంది. సాయం ఉంటేనే కానీ నడవలేని పరిస్థితి. దీనికితోడు ఫిట్స్‌తో ఇంకా ఇబ్బంది పడుతోంది. పాఠశాల ఉపాధ్యాయులు, పాప తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు దృష్టికి తీసుకెళ్లి, వైద్యానికి ఆర్థిక సాయం కోరారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులకు విషయం తెలిపి, వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి సాయం కోసం అభ్యర్థించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు, స్నేహితులు స్పందించడంతో రూ.43 వేలు పోగయ్యాయి. శనివారం ఈ నగదును ఉపాధ్యాయులతో కలసి విద్యార్థి తల్లిదండ్రులకు దుర్గారావు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ, సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత జేఏసీ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు, ఏపీటీఎఫ్ నాయకులు జానీ, సనపల రాజశేఖర్, ఉపాధ్యాయులు రాము, నాని, కస్సే గణేష్, కందుల శ్రీను పాల్గొన్నారు.

చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి



పెరవలి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కానూరు అగ్రహారం రైతులు

పెరవలి: అనుమతులు లేకున్నా దౌర్జన్యంగా రొయ్యల చెరువు తవ్వకాలు చేస్తున్నారని, వెంటనే వాటిని నిలుపుదల చేయాలని కోరుతూ కానూరు అగ్రహారం రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన సుమారు 150 మంది సన్న, చిన్నకారు రైతులు తమ మొరను వెళ్లగక్కారు. ఈ సందర్భంగా రైతులు అధికారి పల్లపురాజు, మేకల భాస్కరరావు, చల్లా సత్యనారాయణ, మేలక త్రిమూర్తులు, బెల్లం కొండ గోవిందు తదితరులు మాట్లాడుతూ, పది రోజులుగా రాత్రి వేళల్లో చెరువులు అక్రమంగా తవ్వుతున్నారని తెలిపారు. అధికార పార్టీకి చెందిన నాయకుల అండతో, ఎటువంటి అనుమతులు లేకపోయినా దౌర్జన్యంగా తవ్వకాలు చేస్తున్నారన్నారు. ఇదేమిటని అడిగితే.. దిక్కున్న చోట చెప్పుకోవాలని అంటున్నారని వాపోయారు. చెరువుల అక్రమ తవ్వకాలతో తమ గ్రామానికి చెందిన 200 ఎకరాల పంట భూమి మునిగిపోతుందని, చెరువులకు వేసే ఉప్పుతో చేలు పండకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వందల ఎకరాల్లో అక్రమ తవ్వకాలు చేశారని, గత ప్రభుత్వంలో ఒక్క చెరువూ తవ్వలేదని వివరించారు. ఇప్పుడు నాయకులు దౌర్జన్యంగా తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. చెరువుల అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే తాము జీవనోపాధికి విఘాతం కలుగుతుందని వాపోయారు. శుక్రవారం రాత్రి రైతులంతా చెరువు తవ్వకాలు అడ్డుకుని, అధికారులకు ఫోన్లు చేశామని, తహసీల్దార్ డి.అచ్యుతకుమారి స్పందించి పోలీసులను పంపించారని తెలిపారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి హామీ ఇచ్చారు. చెరువులు తవ్వటానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని ఆమెతో పాటు, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ దేవానందం స్పష్టం చేశారు.

ఉచిత ప్రవేశాలు అమలు చేయాలి

విద్యా శాఖాధికారులతో ఎంపీపీ దుర్గారావు



అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఎంపీపీ

దేవరపల్లి: పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు స్పష్టం చేశారు. మండల విద్యా శాఖాధికారులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025–26 నూతన విద్యా విధానం, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 25 శాతం సీట్లు ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. పలు పాఠశాలల్లో ఉచిత సీట్లకు ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం మండలంలో 500 సీట్లు పేదలకు కేటాయించాల్సి ఉండగా, కేవలం 92 మంది చేరడంపై పాఠశాలల యాజమాన్యాన్ని ఎంపీపీ ప్రశ్నించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా చదువుకోవచ్చనే విషయాన్ని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్కూలు బస్సులు కండీషన్‌లో ఉండాలని, తరగతి గదులకు మరమ్మతులు, తాగునీటి వసతి, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి వంటి మౌలిక వసతులు కల్పించాలని యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ ఎం.తిరుమలదాస్ మాట్లాడుతూ, ఈ నెల 2 నుంచి 19 వరకు ఉచిత సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఈ సమీక్షలో ఎంఈఓ–2 కేఈఆర్ఎస్‌వీవీ అప్పారావు, మండలంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో ప్రతిభకే పట్టం

247వ ర్యాంకర్ వినయ్‌కు సత్కారం



వినయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చాగల్లు: తల్లిదండ్రులే సివిల్స్ పరీక్షల ప్రిపరేషన్‌లో కీలక భూమిక వహించారని సివిల్స్ 247వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్ అన్నారు. తన స్వగ్రామమైన బ్రహ్మణగూడెంలో శుక్రవారం రాత్రి గ్రామస్తుల అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ, సివిల్స్ పరీక్షల్లో ప్రతిభకే పట్టం కడతారని, డబ్బు, పలుకుబడికి అవకాశం ఉండదన్నారు. అత్యంత క్లిష్టమైన ఈ పరీక్షల్లో లక్ష్యసాధన కోసం నిరుత్సాహపడకుండా, నిరంతర సాధన చేయాలన్నారు. ఎప్పుడు విజయం సాధిస్తామో తెలియకపోయినా, పూర్తి నమ్మకంతో ఉండాలన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం సివిల్స్ సర్వీస్‌లోనే ఉందని, దేశానికి, ప్రజలకు సేవ చేసే అవకాశం ఆలిండియా సర్వీసుల్లో ఉందన్నారు. మూడోసారి రాసినప్పుడు 247వ ర్యాంకు సాధించానన్నారు. 24వ ఏటనే ఈ అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తనపై నమ్మకం ఉంచారని, దానిని నిలబెట్టుకున్నానన్నారు. తనను సన్మానించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలక్ట్రికల్ ఏఈ అయిన వినయ్ తండ్రి జగదీశ్వరరావు, తల్లి కనకదుర్గను ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు. రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు గారపాటి బాబురావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అత్కూరి దొరయ్య, ఎంపీటీసీ పత్తిపాటి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దాహం తీర్చని నీటి తొట్టెలు

- మండలంలో మంజూరైనవి 16
- వివిధ దశల్లో ఉన్నవి 13
- మిగతావి ప్రారంభమే కాలేదు



అయ్యవరంలో నిర్మాణంలో ఉన్న నీటి తొట్టె

నల్లజర్ల: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు మండలంలో 16 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. వీటిని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించాల్సి ఉంది. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.38 వేలు కేటాయించారు. వేసవికి ముందే వీటి నిర్మాణాలు ప్రారంభించి, పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇంకా 13 తొట్టెల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. మరో మూడు అసలు ప్రారంభం కాలేదు. వేసవి నేపథ్యంలో మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉండే వాగులు, కుంటలు, చెరువుల్లో నీటి వనరులు అడుగంటాయి. దీంతో గ్రామ శివార్లలో నిర్మించే నీటితొట్టెల ప్రాధాన్యం పెరిగింది. పూర్తయిన నీటి తొట్టెల్లో పంచాయతీ సిబ్బంది కుళాయిలు అమర్చి, ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీరందించాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో పూర్తయిన తొట్టెల్లో నీరు నింపకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఆవపాడు, నల్లజర్ల పశువుల ఆస్పత్రి పక్కన నిర్మించిన తొట్టెలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. దీనిపై ఏపీఓ వెంకట్రావును వివరణ కోరగా, మంజూరులో జాప్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయన్నారు. పూర్తయిన వాటిలో పంచాయతీల వారు ట్యాంకర్లతో నీరు తరలిస్తున్నారన్నారు. పూర్తయిన వాటికి బిల్లులు ఆలస్యం కావడంతో నిర్మాణాలు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు.

పెన్షనర్లు సంఘటితంగా పోరాడాలి

నిడదవోలు : సమస్యలపై పెన్షనర్లు సంఘటితంగా పోరాడాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు, పెన్షన్లపై వాటి ప్రభావాన్ని ఆంజనేయులు వివరించారు. సంఘ ఆర్థిక స్థితిగతులను కోశాధికారి కె.కుమార్ వివరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు: ఆగ్రాలో ఇటీవల జరిగిన సబ్ జూనియర్స్ టార్గెట్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో చాగల్లు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు, పెద్దలు శనివారం వారిని అభినందించారు. వీరిని ప్రోత్సహిస్తూ ఎండీ నఫీజ్, డాక్టర్ తనూజ నగదు పారితోషికం అందించారు. హెచ్ఎం డి.మోహన్‌కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ గోపాలకృష్ణ, పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

దేవరపల్లి: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు దేవరపల్లిలో ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 8 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఉదయం 8 గంటలకు కోయిల్ ఆల్వార్ తిరుమంజనం ఆలయ సంప్రోక్షణ జరుగుతుంది. 7న సాయంత్రం కల్యాణ మహోత్సవం, అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం నిర్వహిస్తారు. 10న ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుంది.

చెక్కుల పంపిణీ

కొవ్వూరు: నియోజకవర్గంలో 70 మంది బాధితులకు వైద్య ఖర్చుల కోసం రూ.64 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

రోడ్డు పనుల పరిశీలన

నిడదవోలు: పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. ఒకటో వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.8.40 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ ఏఈ అవినాష్ ఉన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి ప్రత్యేక తరగతులు



నల్లజర్లలో సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

నల్లజర్ల: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో గత నెల 25 నుంచే ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. రోజుకో సబ్జెక్ట్ చొప్పున ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. గణితం, సైన్సు, ఇంగ్లిష్ తప్పిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళిక ప్రకారం చదివిస్తున్నట్టు నల్లజర్ల జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం కోమలిచిత్ర తెలిపారు. నాలుగేళ్లతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ఫలితాలు మెరుగ్గానే ఉన్నాయి. అయినప్పటికీ నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించారు. మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల నుంచి 500 మంది పరీక్షలకు హాజరు కాగా, 315 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీలో నూరు శాతం ఫలితాలు సాధించేలా తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు రోజువారీ తరగతులకు హాజరు కావాలని కోరారు.